వైఎస్ఆర్-అన్నమయ్య వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

బుధవారం 30 అక్టోబర్ 2024

అర్హులందరికీ ఉచిత గ్యాస్ - ఆర్డీవో చంద్రమోహన్

బద్వేలు, అక్టోబర్ 29 (ప్రభాతవార్త):

అర్హులైన ప్రతి ఒక్కరూ ఉచితంగా గ్యాస్ అందించేలా ప్రభుత్వం చేపట్టఇందని బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో భాగంగా ఉచిత గ్యాస్ బుకింగ్ దీపావళి నుంచి ప్రారంభించనుందని ఇందుకు అవసరమైన విధివిధానాలు మరియు కలిగి ఉండాల్సిన పత్రాల గురించి ఆయన తెలిపారు. అర్హులు తెల్లరేషన్, ఆధార్ కార్డులు కలిగి ఉండాలని, నిబంధనల మేరకు ముందుగా గ్యాస్‌కు డబ్బులు చెల్లిస్తే లబ్దిదారులకు 24 గంటలలో గాని, 28 గంటలలో గాని వారి అకౌంట్లలో తర్వాత వేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి పట్టణంలోని రెండు గ్యాస్ ఏజన్సీల ద్వారా అర్హుల జాబితాను తెప్పించుకోవడం జరిగిందని, ఈ రెండు ఏజన్సీలలో 35 వేలకు పైగా కనెక్షన్లు ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో కొన్ని డొమెస్టిక్ కనెక్షన్లు ఉన్నందున వాటిని తొలగించి అర్హులను గుర్తించడం జరుగుతుంది. ఈ మేరకు ఏప్రిల్ నుంచి 1, ఆగస్టు నుంచి నవంరు వరకు 1, అలాగే డిసెంబరు నుంచి మార్చి వరకు 1 అందివ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకోసం తగిన సన్నాహాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ సిబ్బంది, గ్యాస్ ఏజన్సీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన జడ్పీ సీఈవో

రాయచోటి, అక్టోబరు 29, ప్రభాతవార్త:

కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల జడ్పీ సీఈవో ఓబులమ్మ మంగళవారం రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల అభివృద్ధిపై తీసుకోవాల్సిన చర్యల గురించి జడ్పీసీఈవోలు చర్చించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి, అక్టోబరు 29, ప్రభాతవార్త:

వైద్యులు రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర రవాణా, యువజనక్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి ఏరియా ఆసుపత్రిలో రాష్ట్ర రవాణా, యువజనక్రీడా శాఖామంత్రి నూతన డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించారు. వంద మందికి డాయలసిస్ చేయడానికి సెంటరును ప్రారంభించడం జరిగిందని మంత్రి తెలిపారు. అనంతరం మంత్రి ఆసుపత్రికి ఎంత రోగులు వస్తున్నారు. వారికి వైద్య సేవలు ఎలా అందుతున్నాయి తదితర విషయాలపై ఆరా తీశారు. రోగులకు తాగునీరు అందుబాటులో ఉంచి ఎప్పటికప్పుడు టాయిలెట్లు శుభ్రపరుస్తూ ఆసుపత్రి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డా.లక్ష్మీప్రసాద్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.కొండయ్య, ఆసుపత్రి సూపరింటెండెంట్ డేవిడ్ సుకుమార్, డాక్టర్లు, నర్సులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం,అక్టోబర్ 29, ప్రభాతవార్త:

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపాలెలోని మంత్రి నివాసం నందు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఏ ఒక్కరు సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎక్కువగా భూ సమస్యలు ఉన్నాయని, వీటి పరిష్కారానికి రెవెన్యూ అధికారులతో సంప్రదించి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వచ్చే సమస్యలన్నీ ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు తెలియజేసి తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఆరోగ్య కేంద్రానికి- ఆనారోగ్యం

ఏటా రూ.1.80 కోట్లు ఖర్చు - కుదుట పడని ఆరోగ్యం

రాజంపేట, అక్టోబర్29, ప్రభాతవార్త :

అనారోగ్యంతో ఉన్నవారిని అక్కున చేర్చుకొని, ఆదరించి, ఆరోగ్యాన్ని పంచే ఆరోగ్య కేంద్రానికి ఆనారోగ్యం వచ్చినట్లు తెలుస్తోంది. ప్రతి ఏటా రూ.1.80కోట్లు ఖర్చు చేసినా ఆరోగ్యం కుదుటపడనట్లు తెలుస్తోంది. గత రెండు నెలలుగా చిల్లిగవ్వ నిధులు లేక మింగను మాత్రలు లేక ఆలనా పాలనా చూసే వైద్యులకు, సిబ్బందికి జీతాలు లేక అనారోగ్యం పాలు కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎంతో మందికి ఆరోగ్యానిచ్చే ఆరోగ్య కేంద్ర పరిస్థితి నేడు దయనీయంగా మారినట్లు తెలుస్తోంది. కార్పోరేట్ స్థాయి ఆసుపత్రులకు ధీటుగా ఆరోగ్య కేంద్ర భవనాలు నిర్మించి అదే స్థాయిలో వైధ్యులనుచ సిబ్బందిని అన్ని రకాల అత్యాధునికమైన కోట్లు విలువ చేసే పరికరాలను పెట్టిన మంగంపేట కార్పోరేషన్ ఆరోగ్య కేంద్రానికి గత రెండు నెలలుగా నిధులు అందక అనారోగ్యం వచ్చేసినట్లు తెలుస్తోంది. మందులు లేక మందుల షాపు ఖాలీగా ఉంది. అక్కడ పని చేసే వైద్యులకు, సిబ్బందికి రెండు నెలలుగా జీతాలు అందక వారు కూడా అవస్థలు పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రతి నెలా ఆసుపత్రి బాగోగుల కోసం లక్ష రూపాయల మందులు కొనుగోలు చేసి అక్కడ పని చేసే వైద్య, సిబ్బందికి జీతాలు అందించే వారు. దీనిని గత 5సంవత్సరాలుగా ఆద్య కాంట్రాక్టర్లు నిర్వహిస్తున్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం రాగానే గత 6 నెలల నుంచి కాంట్రాక్టర్లకు నిధులు అందలేదని తెలుస్తోంది. అప్పటి సంస్థ ఎండీ పలు ఆరోపణలతో ఉండడంతో బిల్లులు కాలేదని ఆద్యా కాంట్రాక్టర్లు చెబుతున్నారు. అయినప్పటికీ సుమారు కోటి రూపాయల మేర మందులు,సిబ్బంది జీతాల కోసం 6నెలలు గడిపామన్నారు. ఈ ఏడాది సెప్టంబర్ 25కు కాంట్రాక్టర్ల గడువు ముగుయనున్న నేపద్యంలో సక్రమంగా బిల్లులు అందక ఈ ఏడాది జులైలోనే రెండు నెలల ముందే కాంట్రాక్ట్ నుంచి విరమించుకునేందుకు ఏపీయండి సంస్థ యాజమాన్యానికి లేఖ పంపామన్నారు. అయితే కొత్త కాంట్రాక్టర్ వచ్చే వరకు మీరే కొనసాగాలని అదనంగా గడువు పెంచుతూ అదేశాలిచ్చి నిధులు అందించలేదన్నారు. వీరి మద్య ఉన్న వ్యత్యాసాలాలతో ఆరోగ్య కేంద్రానికి మందులు అందక సిబ్బంది. వైద్యులకు జీలాలు అందక అక్కడ వైద్య సేవలు కనుమరుగయినట్లు తెలుస్తోంది. ఆసుపత్రిలో కోట్లాది రూపాయలు విలువ చేసే ఎక్స్‌రే వంటి పలు రకాల పరికరాలను కూడా ఏర్పాటు చేయడం జరిగింది. అయితే అవి ప్రస్తుతం అవి రిపేరులో ఉన్నట్లు కూడా వైద్యులు, సిబ్బంది చెబుతున్నారు. ప్రతిరోజు పేషంట్లతో కితకితలాడే ఆరోగ్య కేంద్రం నేడు మందుల లేక వచ్చిన వారికి వైద్యులు మందులు వ్రాసి బయట తెచ్చుకోమని పంపడంతో రోజు రోజుకు ఆసుపత్రికి పేషంట్లు రావడం పూర్తిగా తగ్గిపోయింది. గత నెల 25కు టెండర్ ముగిసింది. కొత్త టెండర్ పిలిచినప్పటికీ కొన్ని కారణాల చేత టెండర్ బిడ్‌ను ఇంకా ప్రకటించనట్లు తెలుస్తోంది. ఆరోగ్య కేంద్రంలో స్వీపర్ మొదలుకొని పై వరకు ఉన్న సిబ్బంది సుమారు 25 మంది ఉన్నట్లు సిబ్బంది తరపున ల్యాబ్ అసిస్టెంట్ పెంచలయ్య తెలిపారు. ముందే చాలీ చాలని జీతాలతో పనులు చేస్తున్నామని దీనికి తోడు రెండు నెలలుగా జీతాలు అందలేదని ఇక్కడ పని చేసే సిబ్బంది కేవలం రూ.11900లనుంచి రూ.15 వేల లోపు పనులు చేసే వారే ఉన్నారని ఏపీ ఎండీసీ సంస్థలో ఆసుపత్రి కూడా ఒక భాగమేనని సంస్థలో పని చేసే వారికి సమాన పనికి సమాన వేతనం అందజేస్తూ రాత్రింబవళ్లు పని చేసే ఆసుపత్రి సిబ్బందికి మాత్రం కాంట్రాక్టర్లకు మాత్రం అర కొర జీతాలు అందజేస్తున్నారన్నారు. సంస్థ తో పాటు ఆసుపత్రి సిబ్బందికి కూడా జీతాలు ఇవ్వాలని ల్యాబ్ టెక్నీషియన్ వారి సిబ్బంది తరపున కోరారు. అదేవిధంగా డ్యూటీలో ఉన్న వీరరామాంజనేయులు వైద్యాధికారిని ప్రశ్నించగా ప్రతి రోజు వందల మంది ఓపీకి వచ్చేవారని గత రెండు నెలల నుంచి వైద్యాధికారులకు. సిబ్బందికి జీతాలు అందక మందులు కొనుగోలు చేయక వచ్చిన ప్రతి పేషంటుకు బయటకు మందుల రాసించడంతో పూర్తిగా రాకుండా పోయారన్నారు. తాము కూడా డ్యూటీలో భాగంగా వచ్చి వెళుతున్నామన్నారు. ఈ విషయమై సంస్థ సీపీఓను మంగళవారం వివరణ కోరగా కొత్త కాంట్రాక్టర్ రాకనే రెండు నెలల జీతాలు ఆగాయని సంస్థ యాజమాన్యం నుంచి నిధులు కూడా రాలేదని వారం రోజుల్లో అంతా సర్థుకుంటుందని సమాదానం ఇచ్చారు.

మున్సిపల్ స్థలాలలో అక్రమ కట్టడాలను తక్షణమే తొలగించండి

- కౌన్సిల్‌లో సభ్యులు లేవనెత్తిన సమస్యలపై దృష్టి పెట్టండి -అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి

ప్రొద్దుటూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త:

మున్సిపల్ స్థలాలలో అక్రమ కట్టడాలను తక్షణమే తొలగించాలని అక్రమణదారులు ఎలాంటి వారైనా ఉపేక్షించవద్దని, కౌన్సిల్లో సభ్యులు లేవనెత్తిన సమస్యలపై పరిష్కారం దిశగా దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ భవణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మిదేవి నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సంధర్భంగా సమావేశంలో కౌన్సిల్ సభ్యులు సమస్యల పరిష్కారంలో అధికారుల అలసత్వం కొట్టొచ్చినట్లు కనపడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి కౌన్సిల్ సభ్యుని సమస్యలపై పరిశీలించి పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలు మరొక సమావేశంలో అదే సమస్యలను లేవనెత్తే పరిస్థితి రాకూడదని ముఖ్యంగా మున్సిపల్ కమీషనర్ సమస్యలపై ప్రత్యక్షంగా దృష్టి పెట్టాలని ఆయన ఆదేశించారు. ముందుగా 11అంశాలతో అధికారులు పొందుపరిచిన అజెండాలో పది అంశాలను కౌన్సిల్ ఆమోదం పొందగా ఒక అంశాన్ని మాత్రం రద్దు చేశారు. ఈ సమావేశంలో పలువురు సభ్యులు వారి వార్డులలోని సమస్యలను కౌన్సిల్ ముందుకు తీసుకువచ్చారు. 3వ వార్డు కౌన్సిలర్ జంబాపురం వెంకటలక్షుమ్మ తమ వార్డులోని మెడినోవా సమీపంలోని మదూరు కాల్వలో చెత్తను సక్రమంగా తొలగించలేదన్నారు. స్పందించిన కమీషనర్ పూర్తిగా తొలగించారని వివరించారు. 33వ వార్డు కౌన్సిలర్ గాజుల శివజ్యోతి తమ వార్డులో కుక్కల బెడద అధికంగా ఉందని, ఎస్.వి.వి బాయ్స్ హైస్కూల్ దగ్గర మున్సిపల్ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించే యత్నం చేస్తున్నారని వార్డులో విద్యుత్ పోల్స్‌పై బ్యానర్లు తొలగించాలని కౌన్సిల్ దృష్టికి తేగా కమీషనర్ స్పందిస్తూ కుక్కల బెడద నివారణకు కృషి చేస్తామని, ఎస్.వి.వి స్కూల్ సమీపంలోని స్థలాన్ని పరిశీలించి తగు రక్షణ గోడ ఏర్పాటుచేస్తామని, విద్యుత్ పోల్స్‌పై బ్యానర్లను కట్టకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 13వ వార్డు కౌన్సిలర్ ఇర్ఫాన్ బాష తమ వార్డులో అక్రమంగా నిర్మిస్తున్న భవణంపై చర్యలు తీసుకోవాలని కోరగా, మున్సిపల్ కమీషనర్ నవంబర్ 4వ తేది జాయింట్ సర్వే చేయిస్తామని తెలపగా కౌన్సిలర్ సంతృప్తి చెందకపోవడంతో చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మిదేవి నాగరాజు కల్పించుకొని జాయింట్ సర్వే వరకు పనులు నిలిపివేసి, పూర్తి చేసి ప్రభుత్వ స్థలం ఐతే చర్యలు తీసుకోవాలని సూచించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగరాజు త్వరలోనే అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కమీషనర్ మల్లికార్జున పట్టణంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై గతంలో 18భవణాల విషయమై న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లగా వాటికి దాదాపు 3.18కోట్ల రూపాయల పెనాల్టీ విధించారని, మరో 20బిల్డింగ్‌లకు కూడ మరో 3కోట్ల వరకు జరిమాన విధించే అవకాశం ఉందని తెలిపారు. వైస్‌చైర్మెన్ ఖాజా మొహీద్దీన్ మున్సిపల్ పార్క్‌లో వాటర్ ఫౌంటెన్ ఎందుకు వినియోగంలో లేదని ప్రశ్నించగా అధికారులు స్పందిస్తూ అక్కడ నైట్ వాచ్‌మేనే లేకపోవడంవలన ఫౌంటెన్‌లోని వస్తువులు అపహరణకు గురయ్యాయని, త్వరలోనే వినియోగంలోకి తెస్తామని వివరించారు. చైర్‌పర్సన్, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నైట్ వాచ్‌మేన్‌ను కానీ, మున్సిపల్ ఔట్ సోర్సింగ్ సిబ్బందికి గాని పార్కులో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. 17వ వార్డులో అక్రమ నిర్మాణాలపై చింతకుంట సరిత మరోసారి కౌన్సిల్ దృష్టికి తీసుకువస్తూ తమకు తెలియజకుండానే ఎలా చేయించారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే వరద ఆదేశాలమేరకు ఏసీపి నాగరాజు మాట్లాడుతూ ఆ వార్డులో సర్వే చేసే ముందుగా సభ్యులకు సమాచారం ఇస్తామని తెలిపారు. మరో మున్సిపల్ వైస్‌చైర్మెన్ పాతకోట బంగారు మునిరెడ్డి ఎగ్జిబిషన్ గుత్తేదారులు గెజిట్ పాటించడం లేదని కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన కమీషనర్ అధిక ధరలకు విక్రయాలపై విచారణ చేయిస్తున్నామన్నారు. అదేవిధంగా మున్సిపాలిటికి మొత్తం డబ్బు చెల్లించారా అని వైస్‌చైర్మెన్ పాతకోట బంగారురెడ్డి అడుగగా కమీషనర్ 1.50కోట్ల రూపాయలు చెల్లించారని, మిగిలిన మొత్తం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని, గతంలో కూడ పలువురు జీఎస్టీ బకాయి పడ్డారని వారి నుండి కూడ ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం రికవరీ చేస్తామని వివరించారు. కౌన్సిలర్ కమాల్ బాష మాట్లాడుతూ కేవలం ఒక ఎగ్జిబిషన్ విషయమే కాకుండా మున్సిపల్ అధికారులు అన్ని విశయాలలో గెజిట్ పాటించి తీరాలని స్పష్టం చేశారు. 32వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో వీధిలైట్లు వెలగడం లేదని సభ దృష్టికి తెచ్చారు. స్పందించిన కమీషనర్ ఈరోజే వీధిలైట్ వచ్చాయని త్వరితగతిన ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్, కో ఆప్షన్ మెంబర్లు, ఇంజనీరింగ్, ఇంజనీరింగ్ పారిశుధ్యం విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే నా ధ్యేయం

- రాష్ట్రంలో కూటమి పాలన విఫలం

- విభేదాలు వీడి సమస్యలపై పోరాటం చేద్దాం

- పులివెందుల నాయకులతో వైకాపా అధినేత వైఎస్ జగన్

పులివెందుల, అక్టోబరు 29, ప్రభాతవార్త ః

రాష్ట్రంలోని ప్రతి వైకాపా కార్యకర్త సంక్షేమమే తన ధ్యేయమని, ఏ కార్యకర్తకు ఎటువంటి సమస్య వచ్చినా తాను ఉండి కాపాడుకుంటానని, సమస్యలపై పోరాటం చేద్దామని, కలిసికట్టుగా ముందుకు వెళ్దామని పులివెందుల వైకాపా నాయకులు, కార్యకర్తలతో వైకాపా అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం వేంపల్లె మండలంలో నూతన వధూవరులను ఆశీర్వదించిన అనంతరం పులివెందులలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి ఆయన చేరుకున్నారు. ముఖ్య నేతలు, కార్యకర్తలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా జమ్మలమడుగు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్న విషయం తెలిసిందే. దీనిపై జమ్మలమడుగు ముఖ్య నేతలతో సుదీర్ఘంగా చర్చించి కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని సూచించారు. అలాగే జమ్మలమడుగు నియోజకవర్గంలోని జమ్మలమడుగు, పెద్దముడియం, మైలవరం మండలాలను రామసుబ్బారెడ్డికి, ముద్దనూరు, కొండాపురం, ఎర్రగుంట్ల మండలాలను సుధీర్‌రెడ్డికి అప్పగించినట్లు సమాచారం. అదే విధంగా జిల్లాలోని వైకాపా నాయకులతో పాటు ప్రతి కార్యకర్తను కలుపుకుని ముందుకు వెళ్దామని, అప్పుడే మనం రాబోయే రోజుల్లో మళ్లీ విజయం సాధించగలమని, ఐకమత్యంగా సమస్యలపై పోరాటం చేద్దామని తెలిపారు. జిల్లాలోని వైకాపా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు జగన్‌ను కలిసేందుకు పులివెందులకు భారీ ఎత్తున చేరుకున్నారు. రాత్రి సమయంలో కూడా జగన్‌మోహన్‌రెడ్డిని కలవడానికి వచ్చిన వారిని ప్రతి ఒక్కరినీ కలిశారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా, చిరునవ్వులతో పలకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో వారి వ్యక్తిగత సమస్యలతో పాటు ఆ ప్రాంత సమస్యలను జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి ఆయన స్పందిస్తూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతోందన్నారు. త్వరలో వైకాపా ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉంటామన్నారు. గురువారం కూడా మాజీ సీఎం వైఎస్ జగన్ పులివెందులలో అందుబాటులో ఉండననున్నారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా వైకాపా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, మేయర్ సురేష్‌బాబు, నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బద్వేలు,పోరుమామిళ్ల ఆసుపత్రులకు వైద్యులను నియమించండి

: వైద్యవిద్యాశాఖ మంత్రికి విన్నవించిన బీజేపీ నాయకులు బొమ్మన

బద్వేలు, అక్టోబర్ 29 (ప్రభాతవార్త):

బద్వేలు, పోరుమామిళ్ల ఆసుపత్రిలో సరైన వైద్యులు లేక రోగులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ప్రత్యేక వైద్యులను నియమించి మెరుగైన వైద్యం అందించేలా చూడాలని వైద్యవిద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు కడప బీజేపీ జిల్లా పార్లమెంటు కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు విన్నవించారు. విజయవాడలోని మంత్రి చాంబర్‌లో మంగళవారం ఆసుపత్రుల స్థితిగతులను ఆయన దృష్టికితీసుకెళ్లారు. ఇందులో భాగంగా బద్వేలు ఆసుపత్రి పరిధిలో రోజుకు వేలమంది రోగులు వస్తున్నారని అయితే మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక వైద్యులు లేక సామాన్యులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని డాక్టర్ల కొరతతో నిరుపేదలు ప్రైవేటు వైద్యం చేయించుకోలేని దుస్థితి ఏర్పడిందన్నారు. అలాగే పోరుమామిళ్ల ఆసుపత్రిలో కూడా ఇలాంటి పరిస్థితే ఏర్పడుతుందని అక్కడ కూడా చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా అనేకమంది రోగులు వస్తుంటారని, సరైన వైద్యం అందక ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. ఈ రెండు ఆసుపత్రులు బద్వేలు నియోజకవర్గానికి వెన్నెముక లాంటివని అన్ని వసతులతో వైద్యం అందించేందుకు గతంలో కొన్ని పరికరాలు అమర్చినప్పటికీ వాటికి సంబంధించిన ఆపరేటర్ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ఆసుపత్రులలో డాక్టర్‌ల కొరత లేకుండా చూస్తూ తగిన సిబ్బందిని కూడా కేటాయించి మెరుగైన వైద్యం పేదలకు అందేలా దృష్టిపెట్టాలని మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు బొమ్మన వివరించగా ఆయన కూడా సానుకూలంగా స్పందించారు.

చిన్నాన్నను చంపిన కొడుకు...

పీలేరు,అక్టోబరు 29 ప్రభాతవార్తః

రక్తపు మడుగులో పడి ఉన్న రమేష్

తండ్రి బ్రతుకుజీవనం కోసం బయట రాష్ట్రాలకు వెళ్లగా తండ్రి స్థానంలో చిన్నాన్న బిడ్డలు ఆలనాపాలన చూసుకోవాల్సింది పోయి, ఆబిడ్డలనే వేదిస్తుండటంతో విరక్తి చెందిన అన్న కుమారుడు తన చిన్నాన్నను హత్య చేసిన సంఘటన సోమవారం రాత్రి నియోజకవర్గంలోని వాల్మీకిపురం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు వాల్మీకిపురం పట్టణం ఎన్టీఆర్ కాలనీకి చెందిన రవి, రమేష్‌లు అన్నదమ్ములు రవి తని భార్య షర్మిలాలు కర్నాటక రాష్ట్రం బెంగుళూరులో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. రవి కుమారుడు అజయ్(13) వాల్మీకిపురంలో పీవీసీ ప్రభుత్వ హైస్కూల్ నందు 9వ తరగతి చదువుతున్నాడు. ఇంటి వద్ద రవి తమ్ముడు రమేష్(35)తో కలిసి నివసిస్తున్నాడు, రమేష్ కూలి పనులకు వెళ్తూ మందుకు బానిస అయ్యాడు. ఈనేపథ్యంలో రమేష్ తన అన్న కుమారుడైన అజయ్‌ను నిత్యం ఇంటికి వచ్చి మద్య మద్యలో కొడుతూ వేధింపులకు గురిచేశాడు, అయితే సోమవారం రాత్రి మరోసారి వీరి మద్య గొడవ కావడంతో అజయ్ తన చిన్నాన్న ను ఇంటిలోని కూరగాయలు తరిగే కత్తితో పొడిచివేశాడు,. రమేష్ రక్తపు మడుగులో పడి ఉండడంతో స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. 108 అక్కడికి చేరుకునే లోపే రమేష్ మతిచెందాడు, సీఐ ప్రసాద్‌బాబు, ఎస్సై చంద్రశేఖర్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిందితుడు అజయ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

జాతీయస్థాయి కబడ్డీకు ఎంపికైన స్వామి

రైల్వేకోడూరు,'అక్టోబర్ 29,ప్రభాతవార్త:

జాతీయ స్థాయి కబడ్డీ జట్టుకు రైల్వేకోడూరు నియోజకవర్గానికి చెందిన హెచ్ ఎం ఎం హై స్కూల్ విద్యార్థి మద్దిలేటి స్వామి ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కళ్యాణ్ వర్మ విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 27 నుంచి 29 వరకు అన్నమయ్య జిల్లా రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో ఉమ్మడి కడప జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించిందని తెలిపారు. అందులో జాతీయ స్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు మద్దిలేటి స్వామి ని,మద్దిలేటికి కబడ్డీ లకు ఉత్తమ శిక్షణ ఇచ్చిన కళ్యాణ వర్మను రాష్ట్ర మంత్రి రాంప్రసాద్ రెడ్డి,రాంప్రసాద్ రెడ్డి సోదరుడు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి,ఎస్ జి ఎస్ కార్యదర్శి అరుణ కుమారి, ఐపీ ఈ భాను మూర్తి రాజు అభినందించారు.

అమెరికా ఎన్నికల్లో రిపబ్లిక్ పార్టీకి మద్దతుగా తానా మాజీ అధ్యక్షుడు సతీష్ ప్రచారం

రాజంపేట అర్బన్, అక్టోబర్ 29, ప్రభాతవార్త:

అమెరికా దేశ అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రచార సభలతో ఉభయ పార్టీలు ప్రచారాన్ని మరింత వేగవంతం చేశాయి. ముఖ్యంగా రిపబ్లికన్ పార్టీ తనదైన శైలిలో దూసుకుపోతుండగా తెలుగు వారు కూడ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల తరపున "తానా" పూర్వ అధ్యక్షులు సతీష్ వేమన, ఆయన మిత్రులు కూడ రిపబ్లికన్ పార్టీ అభ్యర్థుల ప్రచారంలో చురుకుగా పాల్గొంటున్నట్లు తెలిపారు. తెలుగు వారి మద్దతు కూడగొట్టి డోనాల్డ్ ట్రంప్ విజయానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా రెండు లక్షల మంది ప్రజలు హాజరైన చారిత్రాత్మకమైన మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ర్యాలీకి హాజరవ్వటం, ట్రంప్ గెలుపుకు పిలుపునిస్తూ తెలుగు ప్రముఖులైన పరిచయస్తులందరితోనూ సమావేశం అవుతూ ముందుకు సాగుతున్నామన్నారు. మాడిసన్ స్క్వేర్ గార్డెన్ 1800ల నుండి డెమొక్రటిక్, రిపబ్లికన్ సమావేశాలకు ఆతిధ్యం ఇచ్చింది. ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామి, తులసీ గబ్బార్డ్‌లతో సహా యునైటెడ్ స్టేట్స్‌లోని టాప్ 30 ప్రముఖ వ్యక్తులతో పాటు ఉపాధ్యక్ష అభ్యర్థి జెడి వాన్స్‌తో కలిసి సతీష్ వేమన పరిమిత ప్రముఖ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

కమలాపురం, అక్టోబరు 29, ప్రభాతవార్త:

మండల పరిధిలోని నల్లింగాయపల్లి గ్రామం వద్ద స్కూటరు ఢీకొన్న ప్రమాదంలో రాజశేఖర్ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా సుబ్బరాయుడు అనే యువకుడు 108లో రిమ్స్‌కు తరలిస్తున్న సమయంలో మార్గమధ్యలో మృతి చెందాడని ఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు ప్రొద్దుటూరు మండలం వినాయకనగర్‌కు చెందిన కాటం రాజశేఖర్ అనే వ్యక్తి అగస్తలింగాయపల్లెలో జరుగుతున్న తమ బంధువుల మల్లిపెళ్లికి వచ్చాడు. అందరితో పాటు సంతోషంగా తిరిగాడు. అనంతరం తిరిగి ప్రొద్దుటూరుకు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా భారతి సిమెంటు ఫ్యాక్టరీ వద్ద గల కోనేరు దగ్గరకు వచ్చే సరికి ముద్దల సుబ్బరాయుడు స్కూటర్‌పై మరో వ్యక్తిని ఎక్కించుకొని వస్తూ తన మోటారు బైకును అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి పై వ్యక్తిని ఢీకొన్నాడు. దీంతో రాజశేఖర్ అనే వ్యక్తి అక్కడికక్కడే చనిపోగా ముద్దల సుబ్బరాయుడుకు బలమైన గాయాలు తగిలి రిమ్స్‌లో చికిత్సకు తరలిస్తుండగా చనిపోయాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలి

- ఆర్డీవో జాన్ ఎర్విన్ పాలపర్తి

కమలాపురం, అక్టోబరు 29, ప్రభాతవార్త:

ప్రతి రైతు తన భూముల సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకున్నప్పుడే సమస్యలు రావని ఆర్డీవో జాన్ ఎర్విన్ పాలపర్తి తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గ్రీన్‌ఫీల్డ్ భూమిని కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన రైతుల భూముల సమస్యలపై వంద రోజుల్లో పరిష్కరించి ఇస్తామన్నారు. సీఎం చంద్రబాబు నుంచి ఆదేశాలు వచ్చాయని అందుకే సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. పలువురు రైతులు తమ అభ్యంతరాలను తెలపడంతో సర్వే చేయించి వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు శివరామిరెడ్డి పాల్గొన్నారు.

బాలల సంరక్షణపై అవగాహన సదస్సు

రాయచోటి, అక్టోబరు 29, ప్రభాతవార్త:

రాయచోటిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం బాలల సంరక్షణపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాల సంరక్షణ అధికారిని పి.రామలక్ష్మి మాట్లాడుతూ వివాహం ప్రేమ అని ఆలోచించకుండా చదువుపై దృష్టి పెట్టాలని భవిష్యత్తులో ఆరోగ్యంగా ఆనందంగా ఉండాలని ఆమె సూచించారు. నేటి బాలికలే రేపటి పౌరులుగా ఎదగాలన్నారు. 1098, 122 నంబర్లకు ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగినా అత్యాచారాలకు పాల్పడినా సమాచారం తెలపాలన్నారు. నేటి కాలంలో బాల బాలికలపై జరిగే అత్యాచారాలు మరియు హ్యూమన్ సేఫ్టీ ఆఫ్ సెల్ఫ్ డిఫెన్స్ గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర వాటిపై వివరించారు.

మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసిన మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

కడప కార్పొరేషన్, అక్టోబరు 29, ప్రభాతవార్త:

ఏపీ రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని టీడీపీ నాయకులు మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మంత్రి పాలన, ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న తీరును కొనియాడారు.

పెన్నానదిలో మహిళ గల్లంతు

- గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు

సిద్దవటం, అక్టోబరు 29, ప్రభాతవార్త:

సిద్దవటం పెన్నానదిలో ఓ మహిళ గల్లంతు కావడంతో పెన్నానది ఘటనా స్థలం వద్ద సిద్దవటం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టడం జరిగింది. గల్లంతైన మహిళకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఎగువపేట దళితవాడకు చెందిన సునీత (19) అనే యువతి మంగళవారం పెన్నానది వద్ద గల్లంతైందని ఎస్సై చిరంజీవి ఆధ్వర్యంలో సద్దవటం పోలీసులు నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి చీకటి కావడంతో గాలింపు చర్యలకు ఆటంకం కలిగింది. దీంతో బుధవారం తిరిగి గాలింపు చర్యలు చేపట్టనున్నారు.

భూవివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

- ఆర్ అండ్ బీలో పోటాపోటీగా రేకుల షెడ్లు ఏర్పాటు

గాలివీడు, అక్టోబర్ 29(ప్రభాతవార్త):

భూవివాదంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న ఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళ్లితే.. గత ప్రభుత్వంలో రోడ్డు విస్తరణలో భాగంగా గాలివీడు మండల కేంద్రంలోని గేటు నాలుగు రోడ్ల కూడలి వద్ద అక్రమ నిర్మాణాలను తొలగించారు. సర్వే నెంబర్ 2266 లో మొత్తం ప్రభుత్వ భూమి 1.80 ఎకరాలు ఉండగా.. అందులో సర్వే అనంతరం 1.50 ఎకరాల భూమిని ఆర్ అండ్ బీకి అప్పగించగా మిగిలిన 30 సెంట్ల భూమిని పీహెచ్‌సీకి కేటాయించినట్లు రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. అయితే ఇదే క్రమంలో నాలుగు రోడ్ల కూడలి విస్తరణ ప్రక్రియ టెండర్ల దశలో ఉండగా కొందరు స్థానికులు ఖాళీగా ఉన్న ఆర్ అండ్ బీ స్థలంలో పోటాపోటీగా రేకుల షెడ్లను ఏర్పాటు చేశారు. మరోవైపు రేకుల షెడ్లు వెనుక భాగంలో ఖాళీగా ఉన్న ఆర్ అండ్ బీ స్థలంలో పోటాపోటీగా రేకుల షెడ్లను ఏర్పాటు చేశారు. మరోవైపు రేకుల షెడ్లు వెనుక భాగంలో ఖాళీగా ఉన్న జాగా తమ అనుభవంలో ఉందంటూ కొందరు ఒక వర్గం వ్యక్తులు రేకులతో బౌండరీ ఏర్పాటు చేయగా, అయితే అది తమ పట్టా భూమి అంటూ మరో వర్గం వారు రేకులను తొలగించారు. దీంతో రెండు వర్గాల మధ్య ఒక్కసారిగా ఘర్షణ వాతావరణం నెలకొంది. గత రెండు రోజులుగా జరుగుతున్న ఈ సంఘటనల నేపథ్యంలో ఎలాంటి గొడవలు, వివాదాలు తలెత్తుతాయోనని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం కొసమెరుపు. ఇదే విషయమై తహసీల్దార్ భాగ్యలతని వివరణ కోరగా ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగించి హద్దులు కేటాయించనున్నట్లు స్పష్టం చేశారు.

వారంలో ఆక్రమణలు తొలగిస్తాం

- ఆర్ అండ్ బీ డీఈ వెంకటసుబ్బయ్య

గాలివీడు, అక్టోబర్ 29(ప్రభాతవార్త):

ఆర్ అండ్ బీలో ఆక్రమణలో ఉన్న రేకుల షెడ్లను స్వచ్ఛంధంగా తొలగించాలని లేనిచో వారం రోజుల్లో మేమే తొలగిస్తామని ఆర్ అండ్ బీ డీఈ వెంకటసుబ్బయ్య తెలిపారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న ఆర్ అండ్ బీ సర్వే నెంబర్ 2266లో 1.80 సెంట్లు సర్వే చేసి ఎక్కడెక్కడ ఆర్ అండ్ బీ స్థలం ఆక్రమణకు గురైందో గుర్తించి కూడలికి స్వాధీనం చేసుకుంటామన్నారు. ఆక్రమణదారులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

దోమల నివారణకు ఆయిల్‌బాల్స్ విడుదల

పులివెందుల, అక్టోబరు 29, ప్రభాతవార్త :

పులివెందుల అర్బన్ పరిధిలోని బాకరాపురం లయోలా కాలేజి దగ్గర, రోటరీపురం బ్రిడ్జి దగ్గర నీరు నిలిచిన ప్రదేశంలో దోమల నివారణ కోసం ఆయిల్‌బాల్స్ వదిలినట్లు వైద్యాధికారి శాంతికుమార్, సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్యలు తెలిపారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా ఆయిల్‌బాల్స్ వదిలినట్లు తెలిపారు. దోమల నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుబహాన్‌బి, బుజ్జి, మేరీమంజుల, సుజాత, ఆశకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నిరీక్షణ కలిగిన గ్రామస్తులు మోక్షం చూపిన ముక్కా రూపానంద రెడ్డి

రైల్వేకోడూరు,అక్టోబర్ 29,ప్రభాతవార్త:

మండలంలో వెంకటరెడ్డి పల్లి గ్రామంలో మంగళవారం రైల్వేకోడూరు టిడిపి ఇంచార్జి ముక్కా రూపానంద రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సేవ అనేది దేవుడిచ్చిన వరమని, తాను బ్రతికున్నంత కాలం ప్రజాసేవకే అంకితమై పనిచేస్తానన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలలో కార్యకర్తలకు పనులు కల్పిస్తూ అందరి ఆశీస్సులతో నియోజకవర్గాన్ని సశ్యశ్యామలంగా చేస్తానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నారని ఐదు సంవత్సరాలు ఐదు మండలాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ సుబ్బారెడ్డి,మంగంపేట యువ నాయకులు తళ్లెం రమణారెడ్డి,గుండయ్య నాయుడు, ఎన్ఎస్ఆర్‌చకొండేటి వెంకటరమణ, తిరుపతి శేఖర్, సుబ్బరామిరెడ్డి, శ్రీధర్, కొండేటి చలపతి, గడికోట సుబ్బరాయుడు, సీసీఎన్ బ్రదర్స్, రవీంద్రా రెడ్డి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సుడిగాలి పర్యటన

పీలేరు, అక్టోబరు 29 ప్రభాతవార్తః

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న వైసీపీ నాయకులు

స్థానిక మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మంగళవారం పట్టణంలో సుడిగాలపర్యటన చేశారు. పట్టణంలో ఇటీవల నూతనంగా నిర్మించిన ఇంటి గృహప్రవేశం చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనాథరెడ్డి ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండలంలోని బందార్లవాండ్లపల్లెలో ఇటీవల ఏనుగుల దాడిలో మతి చెందిన రాజారెడ్డి ఇంటికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం నాగిరెడ్డి కాలనీలో విశ్రాంత అధ్యాపకులు రాఘవరెడ్డి సతీమణి మతిచెందిన విషయం తెలుసుకుని మాజీ ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి బాధితులను కలిసి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కేవి.పల్లె మండలం గ్యారంపల్లె నందు ఎంపీటీసీ సూర్యనారాయణరెడ్డికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మహల్‌రాజుపల్లెలోని వైస్ ఎంపీపీహరిబాబు నూతనగృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట దండు జగన్‌మోహన్‌రెడ్డి, పెద్దోడన్న, సర్పంచి హబీబ్‌బాషా వార్డు మెంబర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పసుపు అరటి బొప్పాయి పంటలపై అవగాహన

మైదుకూరు,అక్టోబర్ 29,ప్రభాతవార్త:

మైదుకూరు మండలంలోని ఆదిరెడ్డిపల్లి నైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో రైతులు పసుపు అరటి బొప్పాయి పంటలపై సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడి సాధించాలని రైతులను కోరడమైనది. పసుపు లో దుంప పరిమాణం పెరగటానికి క్యాల్షియం నైట్రేట్ మరియు మట్టీకేలను డ్రిప్ ద్వారా అందించాలని కెవికె శాస్త్రవేత్త బాల కృష్ణ తెలియజేశారు. దుంప కుళ్ళు తెగులు నివారించడానికి ట్రైకోడెర్మా వెరిడేను విరివిగా వాడాలని ఏడిఏ కృష్ణమూర్తి రైతులకు అవగాహన కల్పించారు.మరియు ద్రవ జీవామృతం యొక్క డెమోలను రైతులకు తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో ఏడిఏ కృష్ణమూర్తి మండల వ్యవసాయ అధికారి పసల ప్రసన్న మరియు శాస్త్రవేత్తలు శ్రీ విద్య,ఫిరోజ్ మరియు పవన్ కుమార్,రైతు సేవా సహాయకులు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లె,అక్టోబర్ 29, ప్రభాతవార్త:

లక్కిరెడ్డిపల్లె తహశీల్దార్‌గా శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి తహశీల్దార్‌గా ఉన్న ప్రసన్న లక్ష్మీ లక్కిరెడ్డిపల్లె తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూయటి తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. లక్కిరెడ్డిపల్లె మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేష్ బాధ్యతలు చేపట్టారు. రైతుల సమస్యలపై ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తానని తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలో ఎక్కువ రెవెన్యూ పరంగా భూ సమస్యలు ఉన్నాయని, పరిష్కరించేందుకు సిబ్బందితో కలిసి తన వంతు కృషి చేసి రైతులకు న్యాయం చేస్తానని అన్నారు.

కడప జిల్లాపై అంత కక్ష ఎందుకు?

- ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి

వేంపల్లె, అక్టోబరు 29, ప్రభాతవార్త :

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కడప జిల్లాపై కక్ష ఎందుకని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ప్రశ్నించారు. వేంపల్లెలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం కడప జిల్లాపై కక్ష కట్టడం దురదృష్టకరం అన్నారు. మంత్రివర్గంలో కడప జిల్లాకు ప్రాధాన్యత లేదన్నారు. కొప్పర్తిలో రూ.250కోట్లతో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సాంకేతిక శిక్షణా కేంద్రాన్ని కేంద్రం మంజూరు చేస్తే దానిని అమరావతికి మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 56 జారీ చేయడం చాలా అన్యాయం అన్నారు. పులివెందుల మెడికల్ కాలేజి నిర్వహించలేమని చంద్రబాబు ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడంతో ఎన్ఎంసీ అనుమతి పత్రాన్ని ఉపసంహరించుకుందన్నారు. ఈ విధంగా చంద్రబాబు ప్రభుత్వం కడపకు, రాయలసీమకు అన్యాయం చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా రాయలసీమపై ముఖ్యమంత్రి చంద్రబాబు కక్ష మానుకోవాలని, లేకుంటే జిల్లా ప్రజలు సరైన సమయంలో టీడీపీ కూటమికి గుణపాఠం చెబుతారన్నారు.

రసాయన ఎరువుల వినియోగంతో భూసారం తగ్గిపోతుంది

వేంపల్లె, అక్టోబరు 29, ప్రభాతవార్త :

పంట సాగులో రసాయన ఎరువుల వినియోగం వల్ల భూసారం క్రమంగా తగ్గిపోతుందని నవభారత్ ఫెర్టిలైజర్స్ ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని కత్తులూరు, నందిపల్లె గ్రామాల్లో మంగళవారం రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. సేంద్రీయ ఎరువుల వినియోగం వలన కలిగే ఉపయోగాలు, రసాయన ఎరువులు అధికంగా ఉపయోగించడం వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సురేష్‌బాబు, మస్తాన్‌వలి, రైతులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి

వేంపల్లె, అక్టోబరు 29, ప్రభాతవార్త :

రైతుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) అన్నారు. మంగళవారం వేంపల్లెలోని తహసీల్దారు కార్యాలయ సమీపంలో ఉపాధిహామీ పథకం కింద ఏర్పాట చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత విత్తనాల పంపిణీలో పాల్గొని, రైతులకు పొద్దుతిరుగుడు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతిగా రైతులకు నాణ్యమైన విత్తనాలు ఉచితంగా పంపిణీ చేస్తోందన్నారు. గత ప్రభుత్వం రైతులను విస్మరించిందన్నారు. ప్రభుత్వ పథకాలన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేంపల్లె పట్టణంలో అసంపూర్తిగా ఉన్న రోడ్ల పనులు దీపావళి పండుగ తరువాత పున: ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి రాజేంద్రప్రసాద్, టీడీపీ మండల కన్వీనరు రామమునిరెడ్డి, ఉపాధ్యక్షుడు వీరభద్ర, సీనియర్ నేతలు మహమ్మద్ షబ్బీర్, బాలస్వామిరెడ్డి, జగన్నాథరెడ్డి, రామగంగిరెడ్డి, నాయకులు రజనీకాంత్, శివకృష్ణారెడ్డి, తెలంగాణ వలి, డక్కారమేష్, వేమాకుమార్, మహమ్మద్, మడకా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా రాణించేందుకు మెప్మాబజారు దోహదం

పులివెందుల రూరల్, అక్టోబరు 29, ప్రభాతవార్త ః

మహిళలు ఆర్థికంగా రాణించేందుకు మెప్మాబజారు దోహదపడుతుందని పులివెందుల మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, కమీషనరు రాముడు అన్నారు. పులివెందులలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా మహిళా మార్ట్ వద్ద మంగళవారం మెప్మాబజారును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వయం సహాయ సంఘ సభ్యులు తయారు చేసిన పిండివంటలు, గాజులు, హెయిర్‌రిబ్బన్లు, చీరలు, ఇతరత్రా వాటిని మార్కెట్‌లో ఉంచి విక్రయించారు. మెప్మా బజారు ఏర్పాటు చేయడం వల్ల సభ్యులు తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ సదుపాయంతో పాటు అతి తక్కువ ధరకే నాణ్యమైన వస్తువులు వినియోగదారులకు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ హఫీజుల్లా, తదితరులు పాల్గొన్నారు.

10వ తరగతి విద్యార్థులు

100 శాతం ఉత్తీర్ణత సాధించాలి: డిప్యూటీ ఈఓ శివప్రకాశ్ రెడ్డి

వీరబల్లి, అక్టోబర్ 29,ప్రభాతవార్త :

10వ తరగతి విద్యార్థులు బాగా చదివి వంద వాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నమయ్య జిల్లా రాయచోటి డిప్యూటీ ఈఓ శివప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదవాలన్నారు. 10వ తరగతిలో అందరూ ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. ఉపాధ్యాయులు సకాలంలో సిలబస్ పూర్తి చేసి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం వీరబల్లి మండల విద్యావనరుల కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న విద్యార్థుల అపార్ ఇడీలను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ మండల విద్యాశాఖాదికారి క్రిష్ణయ్య తో మాట్లాడుతూ తొందరగా విద్యార్థుల అపార్ ఐడీని పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల విధ్యాశాఖాధికారి క్రిష్ణయ్య, ఎంఐయస్ కోఆర్డినేటర్ రాజు తదితరులు ఉన్నారు.

వరిలో నూతన పద్ధతులు పాటించాలి

దువ్వూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త:

వరి సాగు చేసే సమయంలో రైతులు మేలైన నూతన యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నేలటూరు, పెద్ద జొన్నవరం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పద్ధతుల వల్ల వరి సాగులో వివిధ రకాల తెగుళ్లు వచ్చే అవకాశం ఉందని వాటి నివారణకు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రైతులు నత్రజని వాడకాన్ని పూర్తిగా తగ్గించిన పోటాష్‌ను వాడాలని సూచించారు. అలాగే మినుము పంటలో తేమశాతం అధికం కావడంతో భూమిలో నుండి పోషకాలు తీసుకోలేక పసుపు రంగుగా మారి వేరుకుళ్లు తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు 19:19:19 లీటర్ నీటికి 5గ్రాములు హెక్సా కోనజోల్ 2మిల్లీమీటరు పైరుకు పిచికారి చేయాలన్నారు. అలాగే రబీ సీజన్‌లో సాగు చేసే పంటలకు పంటల భీమా ఏ విధంగా చేయాలనే విశయంపై అవగాహణ కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఓ రాంచరణ్, రైతులు పాల్గొన్నారు.

తపాలా సేవలను వినియోగించుకోవాలి

దువ్వూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త:

తపాల శాఖ ద్వారా వివిధ రకాల సేవలు అందిస్తున్నామని వాటిని వినియోగించుకోవాలని కర్నూల్ రీజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట రెడ్డి అన్నారు. మంగళవారం వెంకట రెడ్డి ఆధ్వర్యంలో దువ్వూరు సబ్ పోస్ట్ ఆఫీస్‌ను తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టాఫీస్ నందు అమలు అవుతున్న పొదుపు ఖాతాలు, ఇన్సూరెన్స్ పాలసీలు, పోస్టల్ బ్యాంక్ వంటి సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అర్హులైన వారికి పొదుపు ఖాతాలు విరివిగా తెరచి వీటి తాలుకు ప్రయోజనాలు అందించాలని తపాల ఉద్యోగులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ వి.విశ్వనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

సౌత్‌జోన్‌కు ఎంపికైన విధ్యార్థి

దువ్వూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త:

మండలంలోని స్థానిక పుల్లారెడ్డి పేటలో ఉన్న శ్రీ లక్ష్మి శ్రీనివాస డిగ్రీ కళాశాల నుండి పసల సిద్ధార్థ ప్రథమ సంవత్సరం బిఎస్సీ మ్యాథమేటిక్స్ చదువుతున్న విధ్యార్థి యూనివర్సిటీలో జరిగిన బ్యాండ్మింటన్ ఎంపికలలో విధ్యార్థి ఎంపికయ్యాడు. సౌత్‌జోన్‌లో ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో వైవియూ యూనివర్సిటి తరపున పాల్గొనడం జరిగింది. ఈ విధ్యార్థిని ఆ కళాశాల యజమాని ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి మరియు ప్రిన్సిపల్ ఎం.రామచంద్ర రెడ్డి, వ్యాయామ అధ్యాపకుడు కే.కన్నయ్య ఆ విధ్యార్థిని అభినందించారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు

సిద్దవటం, అక్టోబరు 29, ప్రభాతవార్త:

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన సిద్దవటం పోలీసు స్టేషన్‌లో టపాసుల వ్యాపారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట సర్కిల్ పరిధిలో టపాసుల దుకాణాలు 19 ఉన్నాయని అగ్ని ప్రమాదాలు జరగకుండా ఇసుక, వాటర్ డ్రమ్ములు, అగ్ని నిరోధక సిలిండర్లు కచ్చితంగా ప్రతి దుకాణాదారుడు ఏర్పాటు చేసుకోవాలని వారికి తగు సూచనల, సలహాలు ఇచ్చారు. మండల పరిధిలో ఉచిత ఇసుక రవాణాపై ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే క్రిమినల్ కేసులు పెడతామని రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణదారులకు ఉచిత ఇసుక విధానం అమలు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణంరాజు నాయక్, ఎస్సై చిరంజీవి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చాయ్ కోసం మసాలా ..

అన్నం తినడంలో ఆలస్యాలూ ఉండొచ్చు కానీ. చాయ్ విషయంలో అలాంటివే ఉండవు. పొద్దున్నే వేడివేడిగా కాస్త టీ తాగితే నిద్రమత్తు వదిలిపోయి చురుగ్గా ఉంటుంది. ఇక అక్కణ్ణించి రాత్రి లోగా ఎన్నిసార్లు తాగితే అంత హుషారు. మనకు ఇంతగా ఇష్టమైన చాయ్ మరింత ప్రత్యేకంగా ఉంటే ఇంకెంత బాగుంటుందో కదూ ! అందుకోసం 'చాయ్ మసాలా పొడి' ఉంటే చాలు.

ఎలా చేయాలంటారా.. కడాయిలో 50 గ్రాముల యాలకులు, 30 గ్రాముల మిరియాలు, 25 గ్రాముల లవంగాలు, రెండు అంగుళాల దాల్చినచెక్క, ఒక టేబుల్‌స్పూన్ సోంపులను తక్కువ సెగ మీద.. మంచి వాసన వచ్చేదాకా వేయించి, పళ్లెంలోకి తీయాలి. తర్వాత 40 గ్రాముల శొంఠిని కూడా అలాగే ఘుమాయించేదాకా వేగనిచ్చి, పళ్లెంలో వేయాలి. ఈసారి తులసి విత్తనాలు కంకులు 8, సంగం జాజికాయను వేయించాలి. అన్నీ చల్లారాక.. మెత్తగా గ్రైండ్ చేసి సీసాలో భద్రం చేసుకోవాలి. టీ కాచేటప్పుడు.. ఈపొడి కాస్త జోడించారంటే

31న ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలు : రెడ్డిసాహెబ్

మదనపల్లె, అక్టోబర్ 29 ప్రభాతవార్త :

స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి ఉక్కు మహిళ ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలు 31న గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు రెడ్డిసాహెబ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ భారతదేశ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించి ఉక్కుమహిళగా పేరు గాంచిన స్వర్గీయ ఇందిరాగాంధీ వర్ధంతి మదనపల్లెలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఉదయం 10గంటలకు పార్టీ కార్యాలయం వద్దకు చేరుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి బెంగుళూరు బస్టాండు వద్ద ఇందిరా గాంధీ విగ్రహం వద్దకు ర్యాలీగా వెళ్ళి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందన్నారు.

డిసెంబర్‌లోపే మదనపల్లె జిల్లా ప్రకటించాలి

జిల్లా సాధన సమితి డిమాండ్

మదనపల్లె, అక్టోబర్ 29 ప్రభాతవార్త :

డిసెంబర్ చివరి నాటికి మదనపల్లెను జిల్లాగా ప్రకటించి, ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర మంత్రి లోకేష్‌బాబు మదనపల్లె ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మదనపల్లె జిల్లా సాధన సమితి కన్వీనర్ పిటిఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా జనాభా లెక్కల సేకరణ చేపడుతున్నట్లు అనంతపురం 2027లో జమిలీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. జమిలీ ఎన్నికల లోపే నూతన జిల్లాల ప్రకటన జరగాలన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని జిల్లా ఆకాంక్ష సాకారం చేయాలని తెలిపారు. తమ ఆకాంక్షల్ని నిర్లక్ష్యం చేస్తే మదనపల్లె ప్రజలు మలివిడత ఆందోళన ప్రారంభించి ఉధృతం చేస్తారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు పాల్గొన్నారు.

అనర్హుల రీలింగ్ యూనిట్లను రద్దు చేయాలి

మంత్రికి బివైఎస్ అధ్యక్షులు పునిత్ విన్నపం

మంత్రికి విన్నవిస్తున్న పునీత్

మదనపల్లె, అక్టోబర్ 29 ప్రభాతవార్త :

గత ప్రభుత్వంలో అధికారపార్టీకి అధికారులు ప్రలోబాలకు లోనై అవినీతికి పాల్పడుతూ నియమ నిబంధనలకు విరుద్ధంగా అనర్హులకు రీలింగ్, టెస్టింగ్ యూనిట్లు కేటాయింపును రద్దు చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక, వ్యవసాయశాఖా మంత్రి కింజారపు అచ్చంనాయుడుకు బివైఎస్ అధ్యక్షులు పునిత్ విన్నవించారు. మంగళవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో బహుజన యువసేన అధ్యక్షులు పునిత్ మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా పునిత్ మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా ఈ అవకతవకలపై అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేశామన్నారు. అలాగే బాధితుల అందరూ కలసి హైకోర్టులో కేసు కూడా వేశామన్నారు. రీలింగ్ అండ్ టెస్టింగ్ యూనిట్లు ఏర్పాటు కోసం కేటాయించిన స్థలాలోన్నల జరిగిన అవకతవకలను క్షణ్ణంగా వివరించారు. మంత్రి సమస్యలను విన్న వెంటనే సిరికల్చర్‌ఆప్ కమీషన్‌కు సిఫార్సు చేస్తూ సమస్యను పరిష్కరించాలని తెలిపారు. పునిత్ వెంట నాయకులు పాల్గొన్నారు.

గ్రామసభలతోనే భూ సమస్యలు పరిష్కారం

మండల సర్వేయర్ నరేంద్ర

సమావేశంలో మాట్లాడుతున్న మండల సర్వేయర్

మదనపల్లె, అక్టోబర్ 29 ప్రభాతవార్త :

గ్రామసభలు ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చునని మండల సర్వేయర్ నరేంద్ర తెలిపారు. మంగళవారం తంబళ్ళపల్లె మండలం గంగిరెడ్డిపల్లె గ్రామ పంచాయితీ కార్యాలయంలో భూసమస్యలకు సంబంధించి డిప్యూటి తహశీల్దార్ నరేంద్రనాయక్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామసభలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ రీసర్వేలో ఎక్కడైనా పొరపాట్లు జరిగి ఉంటే ప్రస్తుతం జరుగుతున్న గ్రామసభల్లో రైతులు అర్జీలు విన్నవించుకుంటే పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. భూ యజమానులు రీసర్వేకు సంబంధించి ఎలాంటి అపోహాలు చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి భూ యజమానికి వారి హక్కు దారిగా ఉన్న భూములను పట్టాదారు పాసుపుస్తకంలో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం జరుగుతుందన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, వన్‌బీ జీరాక్స్‌లను అందజేస్తే పీల్డ్ ఎంక్వైరి చేసి వారికి ఉన్న ఆస్థులను సర్వేనెంబర్ల ప్రకారం పాసుబక్కులో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఓలు, విఆర్‌ఏ, కొట్లపల్లి, గంగిరెడ్డిపల్లె రైతులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం ఇద్దరు అరెస్టు

మదనపల్లెరైం, అక్టోబర్ 29 ప్రభాతవార్త :

అరెస్టు చూపుతున్న దృశ్యం

నిమ్మనపల్లె మండలంలో నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 15లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొన్నట్లు నిమ్మనపల్లె ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. గౌనివారిపల్లె సమీపంలో చింతచెట్టు కింద నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి గిరి, చంద్రశేఖర్‌లను అదుపులోకి తీసుకొని సాటుసారాను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. వీరిని కోర్టుకు హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు.

రైతులతో పాలం పిలుస్తుంది

మైదుకూరు,అక్టోబర్ 29,ప్రభాతవార్త:

మైదుకూరు మండలంలోని తిప్పిడిపల్లి పంచాయతీ కొత్తపల్లి ఆర్.బా.కె వ్యవసాయ శాఖ మైదుకూరు వారు పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం,ఒనిపెంట వారు డాక్టర్ యం.బాలకృష్ణ సీనియర్ శాస్త్రవేత్త మరియు అధిపతి,డాక్టర్ శ్రీ విద్యా రాణి ఎన్ శాస్త్రవేత్త విస్తరణ విభాగం మరియు డాక్టర్ ఎన్ ఫిరోజ్ హుస్సేన్ శాస్త్రవేత్త ఉద్యాన విభాగం,వారు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో శాస్త్రవేత్తలు జీవన ఎరువుల ప్రాముఖ్యత గురించి, పసుపు మరియు అరటి చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు, ఆకు మచ్చ తెగులు మరియు దుంప కుళ్ళు తెగులు యొక్క యాజమాన్యం గురించి వివరించారు.అరటిలో సిగటోక ఆకు మచ్చ తెలుగు యాజమాన్యం,గెలల యాజమాన్యం గురించి వివరించారు. మైదుకూరు ఏడిఏ కృష్ణమూర్తి,వారు రైతు ఓబయ్య పొలాన్ని సందర్శించి పసుపు పంటపై తగిన సూచనలు చేశారు.ప్రకృతి వ్యవసాయం కింద ద్రవ జీవామృతం తయారు విధానాన్ని తెలియజేశారు. వాటి వాడకం వల్ల సూక్ష్మజీవులకు ఆహారంగా ఉపయోగపడుతుందని, భూమి గుల్ల బారుతుంది మరియు భూమి ఆరోగ్యకరంగా తయారవుతుందని తెలియజేశారు. మైదుకూరు వ్యవసాయ అధికారి పి.ప్రసన్న మాట్లాడుతూ మినుము విత్తనాలు, ఉన్నాయని రైతు సోదరులు విత్తన శుద్ధి చేసి నాటుకోవాలని తెలియజేశారు. ఇందులో ఏపీ సీఎన్ ఎఫ్ సిబ్బంది,రైతులు మరియు రైతు సోదరులు 30 మంది పాల్గొన్నారు.

కమలాపురం మండలంలో పొలం పిలుస్తోంది

కమలాపురం, అక్టోబరు 29, ప్రభాతవార్త:

కమలాపురం మండల పరిధిలో జంబాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా వనరుల కేంద్రం డీడీఏ డీవీ రమణారెడ్డి మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని రైతులకు తెలిపారు. అలాగే మినుము పంటలో మేలైన యాజమాన్య పద్ధతులను చేపట్టాలని తెలిపారు. సజ్జ లేదా మొక్క జొన్న పంటలను 4 వరుసలలో తప్పనిసరిగా సాగు చేయాలని సూచించారు. ఎకరానికి 10 నుంచి 20 చొప్పున పసుపు రంగు మరియు నీలం రంగు, తెలుపు రంగు, జిగురు అట్టలను తప్పనిసరిగా ఏర్పాటు చేసి రసం పీల్చు పురుగుల ఉధృత్తిని గమనించి పురుగుమందులను పిచికారి చేసుకోవచ్చని సూచించారు. అంతేకాకుండా ఎకరానికి 8 చొప్పున లింగాకర్షక ఎరబుట్టలను ఏర్పాటు చేసి శనగ పచ్చ పురుగు, పొగాకు లద్దె పురుగులను నివారించవచ్చని తెలిపారు. సహాయ వ్యవసాయ సంచాలకకులు ఏవీ నరసింహారెడ్డి మాట్లాడుతూ మినుము, వనగ పంటలలో ఎక్కువగా మందులు పిచికారి చేయకూడదని సూచించారు. పురుగు మరియు తెగుళ్లు ఉధృత్తిని బట్టి పిచికారి చేసుకోవాలన్నారు. మినుము పంటలో పై పాటుగా తప్పనిసరిగా 19:19:19 ఎరువును 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. తద్వారా మొక్క పెరుగుదలకు దోహదపడుతుందని తెలిఎపారు. శనగ పంటలో ఆవాలను ఎర పంటగా వేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ పాడి పంటలు నెలవారి మ్యాగజైన్‌ను రైతులు రూ.300 సంవత్సర చందా చెల్లించి పాడి పంటలు నెలవారి పుస్తకం పొందవచ్చన్నారు. దీని ద్వారా వ్యవసాయ మరియు అనుబంధ శాఖల పరిజ్ఞాన్ని రైతులు పెంపొందించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సరస్వతి, గ్రామ వ్యవసాయ సహాయకులు మహేశ్వర్‌రెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

కమలాపురం, అక్టోబరు 29, ప్రభాతవార్త:

దీపావళి సందర్భంగా పటాసులు విక్రయించే వినియోగదారులు తప్పక నిబంధనలు పాటించాలన వాటిని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు శివరామిరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో లాటరీ పద్ధతి ద్వారా షాపులను కేటాయించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ వ్యాపారులు టపాసులు విక్రయించే సమయంలో నిబందనలు తప్పక పాటించాలన్నారు. టపాసులకు నిర్ణయించిన ధరల మేరకు విక్రయించాలని ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణాల సమీపంలో ఎక్కడే కానీ డీజేలు లాంటివి ఏర్పాటు చేయరాదన్నారు. లాటరీ పద్ధతిలో ఎవరికి కేటాయించిన దుకాణంలో వారికి సంబంధించిన వారిని మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో దుకాణాదారులు పాల్గొన్నారు.

టపాసుల దుకాణా యజమానులతో డీఎస్పీ



కమలాపురం, అక్టోబరు 29, ప్రభాతవార్త:

తప్పనిసరిగా నీరు, ఇసుక పటాకుల దుకాణాల వద్ద ఏర్పాటు చేసుకోవాలని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ రోషన్‌తో కలిసి దీపావళి పటాసుల దుకాణాల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకే దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని ప్రతి దుకాణం వద్ద ఇసుక నీరు తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. విద్యుత్తు వైర్లు అతుకులు లేకుండా చూసుకోవాలని ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దుకాణాదారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి

కలికిరి, అక్టోబరు 29, ప్రభాతవార్త:

ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి నిర్మాణ పనులను లబ్ధిదారులు వేగవంతం చేయాలని కలికిరి మండలం హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. మంగళవారం కలికిరి పంచాయతీలో ఉన్న కొత్తపల్లె లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఇంటి నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. పనుల్లో జాప్యం చేయకుండా పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలపై పర్యవేక్షణ కరవు

- సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది

కలికిరి, అక్టోబరు 29, ప్రభాతవార్త:

మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో ఉన్న సచివాలయాలపై పర్యవేక్షణ కొరవడడంతో సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. దీంతో అవసరాల నిమిత్తం వచ్చిన ప్రజలు గంటల తరబడి సచివాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఇటీవల విద్యార్తుల తల్లిదండ్రులు ఆధార్ కార్డులో ఇంటి పేరు నమోదు కోసం, పుట్టిన ధ్రువీకరణ పత్రాల కోసం అధిక సంఖ్యలో వస్తున్నారు. సచివాలయ సిబ్బంది అందుబాటులో లేకపోవడం విద్యార్థుల తల్లిదండ్రులకు ఇబ్బందిగా మారింది. ఇటీవల జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, అధికారులు సమయ పాలన పాటించాలని 10.30 గంటలకు చేరుకోవాలని సాయంత్రం 5 వరకు సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అయినప్పటికీ కొందరు సచివాలయ సిబ్బంది ఉదయం సకాలంలో సచివాలయాలకు రావడం లేదు. మధ్యాహ్నం భోజనం నిమిత్తం వెళ్లి అనంతరం 4, 5 గంటల లోపు సచివాలయాలకు వచ్చి హాజరు వేసుకొని వెళ్లిపోతున్నారు. సచివాలయాలను పర్యవేక్షించాల్సిన మండల స్థాయి అధికారులు వారి కార్యాలయాలకే పరిమితం కావడంతో ఈ తంతు జరుగుతోంది. ఇప్పటికీ జిల్లా స్థాయి అధికారులు స్పందించి పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, విద్యార్థులు తల్లిదండ్రులు, రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ప్రభాతవార్త ఎంపీడీవో భానుమూర్తిరావును సంప్రదించగా సచివాలయాలను తనిఖీ చేస్తామని సమయపాలన పాటించని సిబ్బందిపై ప్రతిపాదనలు సిద్ధం చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపి చర్యలు తీసుకునేలా చూస్తామన్నారు.

బీమా సదుపాయం రైతుల పొందాలి

రైల్వేకోడూరు,అక్టోబర్ 29,ప్రభాతవార్త:

రబీ సీజన్ నుంచి పంటలు బీమాను రైతులు వాలంటీరుగా ప్రభుత్వం నిర్ణయించిన ప్రీమియం చెల్లించి బీమా సదుపాయం పొందాలని రైల్వేకోడూరు వ్యవసాయ సహాయ సంచాలకులు కవిత అన్నారు.మంగళవారం రైల్వేకోడూరు మండలంలోని విపిఆర్ కండ్రిక గంగరాజుపాడు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో వరి వేరుశనగ టమాటో మామిడి పంటలకి రబీ 2024-25 సీజన్లో భీమవర్తిస్తుందని ఆమె రైతులకు సూచించారు.రైతు సేవా కేంద్రాలలో పని చేయు వి ఏ ఏ.వి హెచ్ ను సంప్రదించి పంటలకు ఇచ్చే గడువు లోపల కావలసిన డాక్యుమెంట్లు సమర్పించాలని అన్నారు. వ్యవసాయ అధికారి సుధాకర్ మాట్లాడుతూ అరటి బొప్పాయి మామిడిలో అధిక దిగుబడులు సాధించుటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలపడం జరిగింది. బొప్పాయి లో కంచ పంటలుగా జొన్న మొక్కజొన్న అవిశ వేయడం ద్వారా పసుపు జిగురు ఎకరాకు 10 ఏర్పాటు చేయడం ద్వారా వైరస్ తెగుళ్లను సమర్థవంతంగా అరికట్టవచ్చని సుధాకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన పరిశోధన కేంద్రం సైంటిస్ట్ శ్రీధర్, విహెచ్ఎ హరిత నాగేంద్ర, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రహరీగోడ మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

పీలేరు, అక్టోబరు 29 ప్రభాతవార్తః

మండలంలోని జంగంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రహరీగోడ మంజూరు చేయాలని మంగళవారం నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి కి పాఠశాల హెచ్ఎం టి. గంగాధరం వినతిపత్రం అందజేశారు. మండలంలలోని వేపులబైలు గంగమ్మ ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి హాజరైయ్యారు. ఈసందర్భంగా అక్కడికి సమీపంలోని జంగంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయ బందం ఎమ్మెల్యేను కలిసి మాట్లాడుతూ తమ పాఠశాలలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు దాదాపు 140మంది విద్యార్థులు చదువుతున్నారని, 3.5 ఎకరాల విస్తీర్ణం వరకు ప్రహరీ లేని కారణంగా పశువులు పాఠశాల ఆవరనంలోకి వచ్చి మొక్కలు, చెట్లు నాశనం చేస్తున్నాయన్నారు. ప్రహరీ లేనందున పిల్లల విద్యాబోధనకు పాఠశాల అభివద్దికి ఆటంకం కలుగుతోందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రేణుక, షరీఫ్, రమణ, రామమూర్తి, రమణయ్య, ఆనందరాజు, అశోక్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు

పీలేరు, అక్టోబరు 29 ప్రభాతవార్తః

అపార్ ఐడీపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి తెలిపారు. ఈఅవగాహన కార్యక్రమానికి పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు హాజరైయ్యారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యామంత్రిత్వ శాఖ ఒక దేశం, ఒక విద్యార్థి(వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడీ) సంఖ్య అపార్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమి అకౌంట్ రిజిస్ట్రి) విధానాన్ని తీసుకురానుందన్నారు. భారతదేశ విద్యార్థులందరి కోసం రూపొందించిన ప్రత్యేక గుర్తింపు వ్యవస్థ నూతన జాతీయ విద్యావిధానం 2020కి అనుగుణంగా ప్రభుత్వం ప్రారంభించిన వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడీ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. విద్యార్థులకు ఇచ్చే ఈఐడీ ద్వారా వారి స్కోర్ కార్డు, మార్క్‌షీట్లు, గ్రేడ్ షీట్లు, డిగ్రీలు, డిప్లొమాలు, సర్టిఫికేట్లు పాఠ్యాంశాల విజయాలతో సహా వారి అన్ని అకడమిక్ క్రెడిట్లను డిజిటల్ నిల్వ చేయడానికి నిర్వహించడానికి మరియు ప్రాప్యత చేయడానికి ఆపార్ ఐడీ ఒక ప్రత్యేకమైన 12 అంకెల కోడ్ విద్యార్థులకు సహాయపడుతుంది. ఈఐడీ విద్యా వ్యవస్థలో విద్యార్థికి శాశ్వత డిజిటల్ గుర్తింపుగా పనిచేస్తుందని తెలిపారు. ఇది జీవితకాల అకడమిక్ ఐడెంటిటీగా ప్రతి విద్యార్థికి ప్రత్యేకమైన 12 అంకెల ఐడీతో సెంట్రలైజ్డ్ సిస్టమ్ అకడమిక్ రికార్డులను ఒకే చోట నిర్వహిస్తుందని తెలియజేశారు. విద్యార్థి యొక్క విద్య, వత్తిపరమైన కెరీర్ అన్ని చోట్లా అందుబాటులో ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా విద్యార్థుల విజయాలను పరిరక్షించడం క్రెడిట్ గుర్తింపును క్రమబద్ధీకరించడం, విద్యా సౌలభ్యం, సంస్థల మధ్య క్రెడిట్ బదిలీకి ఉపయోగపడుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు మత్తు పదార్థాల అలవాట్లకు దూరంగా ఉంచి వారికి ఉన్నత భవిష్యత్తులో అంది వాళ్లని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూళన కోసం అవగాహణ సదస్సు

ఖాజీపేట, అక్టోబర్ 29, ప్రభాతవార్త:

కడప జిల్లాలో భారత ప్రభుత్వం మరియు యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్రం, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమం (ట్రస్ట్ సంయుక్తంగా అవినీతి నిర్మూళన వారోత్సవాల(విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్)లో భాగంగా అవగాహణ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఖాజీపేట మండలంలో ఉన్న సాహిత్య డిగ్రీ కళాశాలలో జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిధిగా హాజరైన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ టి.శ్వేత అవినీతి నిర్మూళణలో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరంపై మాట్లాడారు. అవినీతిని అరికట్టడంలో యువత ముందుండి పోరాడాలని, సమాజంలో మంచి మార్పుకు దారితీయాలనే ఆశయంతో తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. యువత సమాజంలో అవినీతిని అరికట్టే బాధ్యతను స్వీకరించాలని, నైతిక విలువలను నిలబెట్టుకునే ప్రయత్నం చేయాలని ఆమె కోరారు. జిల్లా యువజన శాఖ అధికారి మణికంఠ మాట్లాడుతూ సమాజంలో అవినీతి నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో యువతలో జాగ్రత్తగా, చైతన్యంతో ముందుకు సాగాలన్నారు. అవినీతి ఉన్న చోట ప్రశ్నించే ధైర్యం కలిగి ఉండాలని, తప్పు జరుగుతుందన్నప్పుడు వెనకాడకుండా ప్రశ్నించడమే నిజమైన ధైర్యమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో శివశంకర్, పి.నవీన్‌కుమార్(కామర్స్ లెక్చరర్), జే.విజయకుమార్, మేజేసియన్ వై.హరేరామ్, మాల కొండయ్య, వీర నరేష్, ఉపేంద్ర, సుబ్బారావు తదితరులు పాల్గొని అవినీతి నిర్మూళణలో సమాజానికి దోహదం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం

రైల్వే కోడూరు అర్బన్,అక్టోబర్ 29,ప్రభాతవవార్త :

మండలంలోని గ్రామాలలో ఏన్నో ఏళ్ల నుంచి సరిగా రోడ్లు లేక ప్రజలు నానా ఇబ్బంది పడుతున్న వైనం కోడూరు మండలంలో నెలకొంది. కాగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పల్లెలకు మహర్ధశ ప్రారంభమైంది. మంగళవారం మండలంలోని వెంకంటం పల్లి పంచాయితీ నందు సిసి రోడ్డు నిర్మాణానాకి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి ముక్కా రూపానంద రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎలాంటి అభివృద్ధి పనులకు నోచుకోలేక వెనుకబడి పోయిందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలు, మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సిసి రోడ్లు నిర్మించి అన్ని మౌళిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు, కూటమి నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

కడపలో రైతులకు 400 పవర్ స్ప్రేయర్ పంపులను పంపిణీ చేసిన దాల్మియా భారత్ ఫౌండేషన్

జమ్మలమడుగు, అక్టోబరు 29, ప్రభాతవార్త:

పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించే దిశగా దాల్మియా సిమెంటు (భారత్) లిమిటెడ్ (డీసీబీఎల్) యొక్క కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగం 400 పవర్ స్ప్రేయర్ పంపులను కడపలో తమ ప్లాంట్‌కు సమీపంలోని గ్రామాల్లోని రైతులకు పంపిణీ చేసింది. ఈ కార్యక్రమం ద్వారా వ్యాధులు మరియు తెగుళ్ల వల్ల కలిగే పంట నష్టాన్ని నియంత్రించడం రైతులకు ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించడం లక్ష్యంగా చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో 193 ఫోర్ స్ట్రోక్ పవర్ స్ప్రేయర్లు మరియు 207 బ్యాటరీలతో పనిచేసే స్ప్రేయర్లు అందించడం జరిగింది. రూ.8,89500 అందజేయగా లబ్దిదారులు రూ.13,55,500 అందజేశారు. ఈ కార్యక్రమంలో కడప యూనిట్ హెడ్ ముఖేష్ కుమార్ సిన్హా మాట్లాడుతూ రైతులు తరచుగా ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానం, వనరులు మరియు సహాయక వ్యవస్థలకు చేరువ కాలేరు. దాల్మియా భారత్ వద్ద ఆధునాతన వ్యవసాయ వ్యవసాయం కార్యక్రమాల ద్వారా చిన్న మరియు సన్నకారు రైతులను శక్తివంతం చేయడానికి మేము అంకిత భావంతో ఉన్నాము. రైతులకు సమర్థవంతమైన, పర్యావరణ అనుకూలమైన పంట నిర్వహణ, పద్ధతులను అందించడం ద్వారా స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించడం మా లక్ష్యమన్నారు.

శ్రీశ్రీఅంకాళమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే

పీలేరు, అక్టోబరు 29 ప్రభాతవార్తః

మండలంలోని వేపులబైలులో వెలసిన శ్రీశ్రీ అంకాళమ్మ ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డిని తెదేపా నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం తెదేపా నాయకులు, కార్యకర్తలతో పార్టీ అభివద్ధికి సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట తెదేపా న

ప్రజాసమస్యపై అధికారులు దృష్టి పెట్టండి

కౌన్సిల్‌మీట్‌లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మదనపల్లె, అక్టోబర్ 29 ప్రభాతవార్త :

పట్టణంలో ప్రజా సమస్యలు పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మంగళవారం కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయాంలో అమల్లోకి వచ్చిన సిఎంఎస్ఎఫ్ విభానాన్ని రద్దుకు కౌన్సిల్‌లో ఏకగ్రీవ తీర్మాణం చేయాలని కౌన్సిలర్లను సూచించారు. ఈ విధానం వల్ల మున్సిపల్ జనరల్ ఫండ్ ప్రభుత్వ ఖజానాలోకి జమ అవుతుందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకువస్తానన్నారు. పట్టణంలో నీటి సమస్య, వీధిదీపాల మరమ్మత్తుల సమస్య అధికంగా ఉన్నట్లు ప్రజలు తన దృష్టికి తెస్తున్నారన్నారు. అధికారులు విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరించి ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. అనంతరం మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ జింకా చలపతి మాట్లాడుతూ పట్టణంలోని ఎన్‌విఆర్ పార్కులో వీధిదీపాలు వెలగక పోవడం వల్ల పార్కుకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదే విధంగా గడ్డి పెరగడం వల్ల పాముల బెడద కూడా ఎక్కువైందన్నారు. నిమ్మనపల్లె సర్కిల్‌లో ఎన్‌టిఆర్ విగ్రహ ఏర్పాటుకు కౌన్సిల్ దృష్టికి రావడం మంచి అభిప్రాయం అన్నారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రజలు విన్నవించే సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అజెండాలో పేర్కొన్న అంశాల ఆమోదంకు కౌన్సిలర్లు ఏకగ్రీవ తీర్మాణం చేశారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ ప్రమీళ, వైస్‌ఛైర్మెన్ నూర్‌అజాం, కౌన్సిలర్లు ప్రసాద్, ఆర్‌వి.శివారెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, కరీముల్లా, గాంధీ, జింకా రాధమ్మ, అధికారులు పాల్గొన్నారు.

శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాలచే
చెస్, టెబుల్‌టెన్నీస్ పోటీలు

షీల్డ్‌ను బహుకరిస్తున్న దృశ్యం

మదనపల్లెక్రైం, అక్టోబర్ 29 ప్రభాతవార్త :

మదనపల్లె పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో చెస్, టెబేల్ టెన్నీస్ ఎస్‌వి యూనివర్శిటి ఇంటర్ కొలిజియేట్ 2024 పురుషుల విభాగంనలనో పోటీలు నిర్వహించారు. చెస్ సెలక్షన్ టోర్నమెంటులో 11 కళాశాలల పాల్గొనగా 20మంది క్రీడాకారులు నాలుగు రౌండ్లు పోటీపడ్డారు. ఇందులో విజేతగా ఎన్ఎస్ బాలాజీ, ఎస్‌జిఎస్ ఆర్ట్ కళాశాల తిరుపతి మొదటిస్థానం, రెండవ స్థానంలో కె.హర్షవర్ధన్, ఎస్‌వియున కళాశాల ఇంజనీరింగ్ తిరుపతి, కె.అరవింద, ఎస్‌వియూనివర్శిటి తిరుపతి, జె.యశ్వంత్ ఎస్‌వి ఆర్ట్స్ కళాశాల తిరుపతి, సి.జగపతి కుప్పం డిగ్రీ కళాశాల ఎంపికయ్యారన్నారు. టేబుల్ టెన్నీస్‌లో సింగిల్స్ విన్నర్, ఎం.హరిబాబు, సింగిల్స్ సీకామ్ కాలేజ్, రన్నర్ జి.సంతోష్, టేబుల్ టెన్నీస్ డబుల్స్ విన్నర్స్ కె.విజయరాజ్, ప్రశాంత్, ఎం.స్వరాజ్, మనోజ్‌లకు కరస్పాండెంట్ గురుప్రసాద్‌చే షీల్డ్ బహుకరించారు. రమాదేవి, బాలాజి, ప్రసాద్, బాలసుబ్రమణ్యం, రాఘవేంద్రలు అభినందించారు.

రక్తదానం చేయండి ప్రాణదాతలుగా నిలవండి

మైదుకూరు,అక్టోబర్ 29,ప్రభాతవార్త:

విధి నిర్వహణ అనువులు బానిస పోలీసు అమర వీరుల త్యాగాలు చిరస్మరణీయమని మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్ కొనియాడారు.పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజు గారి ఆదేశాల మేరకు మైదుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరాన్ని పోలీసులు నిర్వహించారు.మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలోనొ అనేకమంది పోలీసులు,ప్రజలు రక్తదాన శిబిరంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.మైదుకూరు రూరల్ సిఐ శివశంకర్ రక్తాన్ని దానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు.ఈ సందర్భంగా డిఎస్పి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణదానం లాంటి దాని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో రక్తన్ని ఇవ్వడం ద్వారా ఒక ప్రాణాన్ని కాపాడిన వారమవుతామన్నారు. సకాలంలో రక్తమందకపోవడం వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు.సమాజం కోసం దేశం కోసం రేపటి భావితరాల కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసుల త్యాగ ఫలితమే మనమంతా ప్రశాంత జీవితాన్ని గడుపుతున్నామన్నారు.మెరుగైన సమాజం కోసం పాటుపడుతునప్పుడే వారి త్యాగానికి మనమందించే ఘనమైన నివాళి అని తెలిపారు.రక్తదాన శిబిరంలో పాల్గొన్న పోలీసులు,ప్రజలకు,డాక్టర్లకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా అమరవీరుల దినోత్సవం

కాశినాయన , అక్టోబరు 29 ప్రభాతవార్త:

దేశ ప్రజల భద్రత కోసం పోలీసులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని పోరుమామిళ్ల ఏఎస్ఐ నరసింహారావు, హెడ్ కానిస్టేబుల్ దుర్గా మోహన్ రెడ్డిలు తెలిపారు. మంగళవారం పోలీసు అమరవీరుల దినోత్సవం పురస్కరించుకుని పోరుమామిళ్లలోని డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ పోలీసులు ప్రతిరోజూ ప్రజలకోసం విధులు నిర్వహిస్తుంటారని, ఈ నేపథ్యంలో కొంతమంది తమ ప్రాణాలను సైతం కోల్పోవలసి వస్తుందని ఈనేపథ్యంలో గతంలో విధులలో ఉంటూ అమరులైన ఉమేష్ చంద్రను గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఓబులరెడ్డి, అధ్యాపకులు సుధీర్‌కుమార్‌రెడ్డి, మణికుమార్, తేజశ్విని, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో యువతులకు ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు నియోజకవర్గం పరిధిలోని ప్రతిభ ఉన్నా ఆర్థిక స్తోమత లేని యువతులకు న్యూఢిల్లీ వారి డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో సివిల్స్ ఉచిత శిక్షణ అందించనున్నట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ ఆలోచనల మేరకు ధర్మవరం నియోజకవర్గంలో సంస్కృతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో 25మంది యువతులకు సివిల్స్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేశారన్నారు. మంత్రి సత్యకుమార్ ప్రోత్సాహంతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలో కూడ ఆర్థిక స్తోమత లేని ప్రతిభ గల విద్యార్థినిలకు ప్రోత్సాహం అందించి మరింత మందిని సివిల్స్ టాపర్లుగా నిలిపేందుకు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. సంస్కృతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసర రెడ్డి మాట్లాడుతూ ప్రతి పోటీ పరీక్షలలో ప్రొద్దుటూరు విద్యార్థులు ప్రతిభ చూపుతున్న సంగతి తెలిసిందే అన్నారు.

మరింత మందిని ఉన్నత స్థాయిలో నిలిపేందుకు టిడిపి నాయకులు నంద్యాల కొండారెడ్డి, డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ వారి శిక్షణ ఇప్పించేందుకు కృషి చేస్తున్న ఆయనకు అభినందనలు తెలిపారు. సివిల్స్ శిక్షణ పొందే యువతులు నవంబర్ మూడవ తేది స్థానిక కామిశెట్టి డిగ్రీ కళాశాలలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల యువతులు క్రింది నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి-98856 09999, డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి-99850 61155.

జిల్లాకు చేరుకున్న వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వేంపల్లె, అక్టోబరు 29, ప్రభాతవార్త ః

వైకాపా అధినేత, పులివెందుల ఎమ్మెల్యే, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం కడప జిల్లాకు చేరుకున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ముందుగా ఇడుపులపాయలోని తండ్రి, దివంగత వైఎస్ఆర్ సమాధికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. అనంతరం అక్కడే ఉన్న వైఎస్ ఆర్ విగ్రహానికి నసమ్కరించి ముందుకు సాగారు. వేంపల్లెలోని సాయినగర్‌లో ఉన్న వైకాపా నాయకుడు రు ద్రభాస్కర్‌రెడ్డి స్వగృహానికి చేరుకుని ఇటీవల వివాహం జరిగిన ఆయన కుమారుడు భరతసింహారెడ్డి, కోడలు సుశాంతికలను ఆయన ఆశీర్వదించారు. అలాగే మాజీ జడ్పీటీసీ సభ్యుడు షేక్ షబ్బీర్‌వలి ఇంటికి వెళ్లి మాజీ కోఆప్షన్ సభ్యుడు సాదక్‌వలితో ఆప్యాయంగా కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం అక్కడి నుండి నేరుగా పులివెందులకు బయలుదేరి వెళ్లారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేంపల్లెకు వచ్చిన సందర్భంగా వైకాపా నాయకులు పెద్దఎత్తున హాజరై తమ అభిమాన నేతను కలిసేందుకు ఉత్సాహం చూపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు ఎం.రవికుమార్‌రెడ్డి, వైకాపా కన్వీనరు చంద్ర ఓబుళరెడ్డి, సర్పంచి ఆర్.శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మిగాయత్రి, యువనేత తుషార్‌నాగిరెడ్డి, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే
కఠిన చర్యలు తప్పవు

- బెల్టుషాపులపై ఉక్కుపాదం - డీఎస్పీ వెంకటేశ్వర్లు

కమలాపురం, అక్టోబరు 29, ప్రభాతవార్త:

కమలాపురం మండల పరిధిలో బెల్టు షాపులు నడుపుతున్న వారిపై కడప డీఎస్పీ ఆదేశాల మేరకు కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో బెల్టుషాపులు నడుపుతున్న వారిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. వైన్, బార్ అండ్ రెస్టారెంట్ వారికి పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. జిల్లాలో ఎక్కడైనా బెల్టుషాపులు నడిపినా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ రోషన్, ఎస్సై ప్రతాప్‌రెడ్డి, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అడవిని తలపిస్తున్న తంబళ్లపల్లె స్మశాన వాటిక

తంబళ్లపల్లె, అక్టోబరు 29, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండల కేంద్రానికి సమీపంలోని స్మశాన వాటిక కంపచెట్లతో నిండి అటవీ ప్రాంతాన్ని తలపిస్తోంది. తంబళ్లపల్లె నియోజకవర్గ కేంద్రంలో సుమారు 5 వేలకు పైగా జనాభా ఉండి అక్కమ్మ చెరువు కట్ట కింద దశాబ్దాలుగా స్మశాన వాటికలో శవాలకు అంత్యక్రియలు నిర్వహించడం జరుగుతోంది. గత కొంత కాలంగా స్మశాన వాటకలో పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు ఏపుగా పెరిగి అడవిన తలపిస్తోంది. తంబళ్లపల్లె మండల కేంద్రంలో ఎవరైనా చనిపోతే దహన క్రియలు చేయడానికి అక్కమ్మ చెరువు కట్ట కందకు వెళ్లడానికి భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి స్మశాన వాటికలోని చెట్లను తొలగించాలని తంబళ్లపల్లె పుర ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్తు సమ్యలపై
అప్రమత్తంగా ఉండండి : ఏడీ గోవిందర్‌రెడ్డి

తంబళ్లపల్లె, అక్టోబరు 29, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలంలోని 5 సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్తు సమస్యలపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని విద్యుత్తు శాఖ ఏడీ గోవిందరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన కన్నెమడుగు విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం రైతులకు వ్యవసాయానికి విద్యుత్తు సరఫరా వేళలపై స్థానిక సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకొని రైతులకు వ్యవసాయానికి ఇబ్బంది లేకుండా విద్యుత్తు సరఫరా కొనసాగించాలని సూచించారు. అదే విధంగా విద్యుత్తు వినియోగదారులు, కక్షిదారులు విద్యుత్తు సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం సబ్ స్టేషన్‌లో దసరా సందర్భంగా పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట ఏఈ శేషుకుమార్, లైన్‌ఇన్‌స్పెక్టర్లు భాస్కర్, నాగరాజు, లైన్‌మెన్లు శంకర్, అప్పిరెడ్డి, ప్రభాకర్, విద్యుత్తు సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంలో దూసుకుపోతున్న నాయకులు

తంబళ్లపల్లె, అక్టోబరు 29, ప్రభాతవార్త:

తంబల్లపల్లె మండలంలో తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు తెదేపా సభ్యత్వ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దూసుకుపోతున్నారు. మంగళవారం మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి ఆధ్వర్యంలో ఆర్.ఎన్.తాండా, జుంజురపెంట, కొటాల, గోపిదిన్నె పంచాయతీల పరిధిలోని మారుమూల గ్రామాల్లో తెదేపా సభ్యత్వ నమోదుకు ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావడం హర్షనీయమని టీడీపీ నాయకులు తెలిపారు. మహిళలు, యువత, దివ్యాంగులు చొరవ చూపిస్తున్నారన్నారు. మహిళా నేత సిద్దమ్మ, మాజజీ సర్పంచ్ సిద్దమల్‌రెడ్డి, తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నరసింహులు, పార్లమెంటు టీడీపీ బీసీ నేత సోమశేఖర్, సుధాకర్‌రెడ్డి, సామిరెడ్డి, యువ నాయకుడు జగదీష్, నారాయణ, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, రామలింగారెడ్డి, ఎర్రసానిపల్లి సుధాకర్, ల్యాబ్ రమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి క్యాంప్ కార్యాలయంలో
ప్రజా దర్బార్‌కు పోటెత్తిన ప్రజలు

రాయచోటి, అక్టోబరు 29, ప్రభాతవార్త:

రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం రాయచోటి పట్టణంలోని తమ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన ప్రజా దర్బార్ ప్రజలకు భరోసానిస్తుందన్నారు. మంత్రి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలన్నారు.

చౌకదుకాణాలను తలపిస్తున్న టపాకాయల అంగళ్లు

- విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చిన అధికారులు

ఓబులవారిపల్లె, అక్టోబరు 29, ప్రభాతవార్త:

ఓబులవారిపల్లె మండలం, రైల్వేకోడూరు నియోజకవర్గంలోని 5 మండలాల్లోనూ దీపావళి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలు చౌక దుకాణాలను తలపిస్తున్నాయని అధికారులు విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వడంతో ఇష్టమొచ్చినట్లు ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని ఎక్కడ పడితే అక్కడ వందల సంఖ్యలో టపాసుల దుకాణాలు వెలిశాయి. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా నిబంధనల మేరకే ప్రజా వినతుల ప్రకారం అనుమతులు ఇచ్చామని చెప్పుకొస్తున్నారు.

ఉద్యమంలా తెదేపా సభ్యత్వ నమోదు

సిద్దవటం, అక్టోబరు 29, ప్రభాతవార్త:

ఒక ఉద్యమంలా తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలన రాజంపేట నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. మండల పరిధిలోని భాకరాపేట, మాధవరం గ్రామాల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తెదేపా నేత చెంచయ్యనాయుడు స్వగృహంలో మంగళవారం పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అనే స్ఫూర్తితో స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన తెదేపా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు కార్యకర్తల సంక్షేమం కోసం పెద్దపీట వేస్తున్నారని అందులో భాగంగానే అక్టోబరు 26 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఎకారం చుట్టారని సిద్దవటం మండల పరిధిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రూ.వంద సభ్యత్వ నమోదుకు రూ.5లక్షలు ఇన్సూరెన్స్ ఉంటుందని ప్రమాదవశాత్తు మృత్యువాత పడిన కార్యకర్తకు రూ.10వేలు మట్టి ఖర్చులకు అందిస్తుందన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ సభ్యత్వ నమోదులో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మండల పరిధిలో సభ్యత్వ నమోదు ఖర్చులకు ఉచితంగా రూ.50వేలు పార్టీ కోసం అందిస్తానని రాజంపేట నియోజకవర్గ పార్లమెంటు ఉపాధ్యక్షులు పుత్త రామచంద్రయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ కుప్పాల వెంకట సుబ్బయ్య, పార్లమెంటు కార్యదర్శి నాగమునిరెడ్డి, యువ నాయకులు రాజా నాయుడు, సర్పంచ్ ప్రతినిధి వెంకటేశ్వర్లు, అవ్వారు రాజారాం, రామ్మోహన్ నాయుడు, మల్లు వెంకట సుబ్బారెడ్డి, జింక శివ, బండి ఓబులేసు, పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఒంటిమిట్ట సీఐని కలిసిన టీడీపీ నేతలు

సిద్దవటం, అక్టోబరు 29, ప్రభాతవార్త:

సిద్దవటం మండల కేంద్రమైన సిద్దవటంపోలీసు స్టేషన్‌లో ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజు నాయక్‌ను తెదేపా అధ్యక్షులు శనివవారపు మోహన్‌రెడ్డి, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి దశరథ రామానాయుడు, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వహక కార్యదర్శి కాడే శ్రీనివాసన్ నాయుడు, తెదేపా మాజీ మండల అధ్యక్షులు సామ శ్రీనివాసులు, భాకరాపేట సర్పంచ్ ప్రతినిధి తుర్ర ప్రతాప్‌నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

జీవితాంతం ఖైదు అధికారం దిగువ కోర్టులకు లేదు

(కర్ణాటక హైకోర్టు స్పష్టీకరణ)

బద్వేలు లీగల్, అక్టోబరు 29 ప్రభాతవార్త :

నేరస్తులు జీవితాంతం వరకూ ఖైదు అనుభవించేలా ప్రత్యేక వర్గీకరణ శిక్షలు విధించే అధికారం విచారణ న్యాయస్థానాలకు, దిగువ కోర్టులకు ఉండదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. ముందస్తు విడుదలకు అవకాశం లేని జీవిత ఖైదును విధించే అధికారం సుప్రీం కోర్టు లేదా హైకోర్టులకు మాత్రమే ఉందని అప్పటి జస్టిస్ కె.సోమశేఖర్, జస్టిస్ రాజేష్ రాయ్ కె లతో కూడిన ధర్మాసనం పేర్కొంది (హరీష్ ఎదిరి స్టేట్ ఆఫ్ కర్ణాటక : సిఆర్ఎల్ఎ 1286 ఆఫ్ 2016) వ్యాజ్యములో ఉన్నత న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. రాజీవ్ గాంధీ హత్య కేసులో శిక్ష పడిన వారి ముందస్తు విడుదలపై యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ వి.శ్రీహరణ్ అలియాస్ మురుగన్ మరియు ఇతరులు కేసులో సుప్రీం కోర్టు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు ధర్మాసనం ఉటంకించింది. హేయమైన నేరాలు పెరుగుతున్నందున కేసుల పరిష్కారంలో జాప్యం జరుగుతున్నందున బాధితులకు న్యాయం చేయడం కొరకు దోషులకు ముందస్తు విడుదల అవకాశం లేని ప్రత్యేక వర్గీకరణ శిక్షలు అవసరమేనని సుప్రీం కోర్టు ఆ వ్యాజ్యములో అభిప్రాయపడింది. అయితే అలాంటి ప్రత్యేక శిక్షలను హైకోర్టు లేదా సుప్రీం కోర్టు మాత్రమే విధించాలని, విచారణ న్యాయస్థానం విధించరాదని కూడా సుప్రీం కోర్టు నేరస్థుడు ఆ తీర్పులో పేర్కొన్నట్లు కర్ణాటక హైకోర్టు గుర్తు చేసింది. ఒక ప్రియురాలి భర్తను హత్య చేసిన కేసులో మరణం ప్రాప్తించే వరకూ నేరస్థుడు జైలులోనే ఉండాలని విచారణ న్యాయస్థానం (ట్రయల్ కోర్టు) విధించిన శిక్షపై దాఖలైన అప్పీలును విచారించిన సందర్భంగా ఈ తీర్పును వెలువరించింది.

గిరిజనులకు న్యాయ విజ్ఞాన సదస్సు

కడప లీగల్, అక్టోబరు 29, ప్రభాతవార్త:

ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి ఛైర్మన్ ఎల్.వెంకటేశ్వరరావు సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జీ బాబాఫకృద్దీన్ మైదుకూరు మండలం గంజికుంట తాండా గిరిజనులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండ, పల్లె, గిరిజన ప్రాంతాలు, గ్రామాలను గుర్తించి వారికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాలు గురించి వివరించి వారి సమస్యలను తెలుసుకునే విధంగా టీం సభ్యులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గిరిజనులు, గ్రామస్థులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, హెల్త్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ మొదలగు సర్టిఫికెట్ల కోసం ఏవైనా సందేహాలు ఉన్నా లేక అప్లై చేసి అవి రాకపోయినా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను లేక దగ్గరలోని మండల న్యాయ సేవా సమితులను సంప్రదించి గిరిజనులకు లేక గ్రామస్తులకు తగు సూచనలు, సలహాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రైబుల్ వెల్ఫేర్ ఆఫీసర్ సరస్వతి, అసిస్టెంట్ ట్రైబల్ ఆఫీసర్ సురేష్, తహసీల్దార్ నరసింహ, ఎంపీడీవో శ్రీధర్ నాయుడు, పంచాయతీ ప్రెసిడెంట్ పోలీసు అధికారులు, వైద్య శాఖాధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వివిధ విభాగాల సిబ్బంది, ప్యానల్ న్యాయవాది నాగభూషణం, పారా లీగల్ వాలంటీర్ సురేష్ సహాయం, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, గిరిజనులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో జిల్లా స్థాయి ప్రతిభ చాటిన విద్యార్థి

పీలేరు, అక్టోబరు 29 ప్రభాతవార్తః

పోలీసు శాఖ జిల్లా స్థాయిలో నిర్వహించిన వకత్వ పోటీల్లో పీలేరు వీఎస్ఎన్ సిద్దార్థ పాఠశాల విద్యార్థి తన ప్రతిభను చాటుకున్నారు. సైబర్ క్రైమ్ నివారణలో విద్యార్థులు పాత్ర అనే అంశంపై జిల్లా పోలీసులు వకత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పీలేరు వీఎస్ఎన్ సిద్దార్థ స్కూల్ ఒలంపియాడ్ విభాగంలో 9వ తరగతి చదువుతున్న సనా ముబారక్ జిల్లా స్థాయిలో రెండవ స్థానం సాధించినందున విద్యాసంస్థల అధినేత్రి వడ్ల మూడి మాధవి మంగళవారం తెలిపారు. మూడు రోజుల క్రితం రాయచోటిలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో సనా ముబారక్ పాల్గొందని విజేతలను జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఎంపిక చేసి మంగళవారం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రాయచోటి లోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన బహుమతుల ప్రధానోత్సవంలో సనా ముబారక్ జిల్లా ఎస్పీ చేతులు మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన సనా ముబారక్‌ను వీఎస్ఎన్ సిద్దార్థ విద్యాసంస్థ అధినేత్రి మాధవి, ప్రిన్సిపాల్ సురేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

అన్నమయ్య జిల్లాను అడ్వెంచర్
టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయాలి

రాయచోటి, అక్టోబరు 29, ప్రభాతవార్త:

అన్నమయ్య జిల్లాలోని హార్సిలీహిల్స్, గుర్రంకొండ వంటి ప్రాంతాల్లో అడ్వెంచర్ పర్యాటక